క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న సెబ్ పోలీసులు

పెనుకొండ రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మద్యం విక్రేతను సెబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సెబ్ సీఐ శ్రీనివాసరెడ్డి వివరాలమేరకు... మునిమడుగుకు చెందిన రత్నమ్మ అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. సిబ్బందితో దాడులు నిర్వహించి పది కేసుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రత్నమ్మను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

పరిగి: మండలంలోని బీచిగానిపల్లిలో కర్ణాటక మద్యం అమ్ముతున్న రామప్ప అనే వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఇంటిపై దాడి చేసి 50 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పోలీసుస్టేషన్‌లో ఇంటర్ ప్రశ్నపత్రాలు భద్రం

మడకశిర: ఇంటర్ వార్షిక పరీక్షలకు సంబంధించిన జనరల్, వృత్తి విద్యాకోర్సుల ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్లలో సంబంధిత పరీక్ష కేంద్రాల అధికారులు భద్రపరచారు. మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. దీంతో ఆ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ప్రభుత్వం మూడు సెట్లు తయారు చేసింది. ఆ ప్రశ్న పత్రాలను అన్ని పరీక్ష కేంద్రాలకు సరఫరా చేసింది. మూడు సెట్ల ప్రశ్న పత్రాలను ఆయా పరీక్ష కేంద్రాల సమీపంలోని పోలీస్‌స్టేషన్లలో అధికారులు భద్రపరిచారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నపత్రాలను ఆయా పరీక్ష కేంద్రాల ఆధికారులు పరిశీలించి వాటిని ప్రత్యేక బాక్సుల్లో ఉంచి తాళాలతో పాటు సీల్ వేశారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

అమరాపురం: మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం రావడంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా తాగునీటిని అందించాలన్నారు. ఎక్కడైనా సమస్య వస్తే తమకు ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే మండలంలోని ప్రతి కుటుంబానికి ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేయాలన్నారు. మార్చి 3న పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందన్నారు. 0 నుంచి 5 సంవత్సరంల్లోపు పిల్లలకు పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించాలన్నారు. పంచాయతీల వారీగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు పెండింగ్‌లో ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సేవాభావం అలవర్చుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రసాద్

పెనుకొండ రూరల్: ప్రతి విద్యార్థి సేవా భావం అలవర్చుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని రాంపురం గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనంతపురం ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు ప్రసాద్ పలు సూచనలు, సలహాలిచ్చారు. ప్రిన్సిపాల్ కేశవరావు, పీడీ కాంతరావు, ప్రధానోపాధ్యయురాలు ఇందిర, శ్రీదేవి, యశోదా రాణి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

సోమందేపల్లి: మండలంలోని నాగినాయని చెరువు, బ్రాహ్మణపల్లి, చల్లపల్లి, కేతగాని చెరువు గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. మౌలిక వసతులపై అధికారులతో ఆరా తీశారు. ఓటరు జాబితాపై బీఎల్‌ఓలతో చర్చించారు.

చిలమత్తూరు: మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ భాగ్యలత మంగళవారం పరిశీలించారు. చాగలేరు, పలగలపల్లి, వీరాపురం, చిలమత్తూరు పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించారు.

అగళి: మండల పరిధిలోని 27 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ వేంకటేశ్వర్లు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు, ఆర్ఐ గుర్రన్న పరిశీలించారు. చిన్నపాటి సమస్యలు ఉంటే పాఠశాల నిధులతో సరిచేసుకోవాలని హెచ్ఎంలకు సూచించారు.

జోరుగా చిట్టీల దందా !

- 'పురం'లో అనధికారికంగా చిట్టీల నిర్వహణ
- రూ.లక్ష నుంచి రూ.25 లక్షల వరకూ లావాదేవీలు
- మధ్యలోనే ఉడాయిస్తున్న వారే అధికం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

హిందూపురం అర్బన్: హిందూపురం పట్టణ జనాభా 3 లక్షలు ఉండగా.. 50 వేల మందికి పైగా ఉద్యోగులు, మరో 20 వేల మంది వర్తకులు, చిల్లర వ్యాపారులు ఉన్నారు. హిందూపురం, గోరంట్ల, మడకశిర, పెనుకొండ ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు, బంగారం వ్యాపారులు, ముద్దిరెడ్డిపల్లి పట్టు చీరల వ్యాపారులు, మండీల వ్యాపారులు (చింతపండు, మిర్చి) ఐరన్, చిల్లర వ్యాపారులే లక్ష్యంగా వారితో కొందరు అనధికారికంగా చిట్టీలు నడుపుతున్నారు. రూ. లక్ష నుంచి 25 లక్షల వరకూ నిర్వహిస్తూ కమీషన్ల రూపంలో అందినంతా దోచుకుంటున్నారు. పట్టణంలో కొంత మంది చిట్టీల నిర్వహణకు అనుమతులు పొందినా లెక్కల్లో చూపుతున్నది నెలకు రెండు, మూడు మాత్రమే. దాని చాటున 10-12 చీటీలు సైతం నడుపుతున్న వారు ఉన్నారు.

డబ్బు ఇవ్వడంలోనూ ఆలస్యం

ఎలాంటి చిట్టీ నిర్వహించినా (20 నెలలు, 25 నెలలు) కమిషన్‌గా ఓ చీటీ తీసుకొంటుంటారు. చిట్టీలు పాడిన వారికి నెల తరువాత నగదు ఇవ్వడం, కొందరు మరీ ఆలస్యం చేయడం సర్వసాధారణమైంది. ఈ చిట్టీల వ్యవహారం పట్టణానికి చెందిన కొందరు ప్రముఖుల కనుసన్నల్లో జరుగుతుండటం విశేషం.

చిట్టీల సొమ్మే పెట్టుబడి...

కొందరు తమ వద్ద చిట్టీలు వేసే వారికి అధిక వడ్డీ చూపుతూ అదే మొత్తాలను తీసుకొని మరో వ్యాపారంలో పెట్టుబడులు పెడుతున్నారు. కొంత కాలం వడ్డీలు బాగాయిస్తూ ఆ తరువాత పట్టణం నుంచి ఉడాయిస్తున్నారు. ఇలాంటి వారు పట్టణంలో 200 మంది వరకూ ఉన్నట్లు సమాచారం.



రెండేళ్ల క్రితం పట్టణంలోని చిన్నమార్కెట్‌లో చిన్న మైక్రో ఫైనాన్స్ పేరుతో ఓ మహిళ డిపాజిట్ల రూపంలో రూ.40 కోట్ల వరకూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏజెంట్లను పెట్టి డిపాజిట్లు సేకరించింది. దీని మరుగున చిట్టీలు నిర్వహించేది. చివరకు రాత్రికి రాత్రే ఉడాయించడంతో వందలాది మంది పేద, మధ్య తరగతి వర్గాల వారు నష్టపోయారు.

పట్టణంలోని మేళాపురానికి చెందిన కొందరు ఓ సంఘంగా ఏర్పడి చిట్టీలు, పలువురికి అప్పులు ఇవ్వడం చేస్తూ వచ్చారు. కొంత కాలానికే పెద్ద మొత్తం సమకూరడంతో సంఘంలోని ముఖ్యులు ఉడాయించారు. స్థానికంగా ఉండేవారు చిట్టీలు, డిపాజిట్లు చేసిన వారికి తిరిగి డబ్బు చెల్లించే విషయంలో సమాధానం చెప్పలేక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు.

పట్టణంలో తోపుడు బళ్లలో వ్యాపారం సాగించే చిల్లర వ్యాపారులకు అప్పులిచ్చే కొందరు సాయంత్రానికి రూ.100కు 10 వంతున వసూలు చేస్తున్నారు. ఒక్కో చిల్లర వ్యాపారి పండ్లు, కూరగాయలు ఇతరత్రా బండ్లపై పోసుకొనే వారు రూ.5000-రూ.10000 వరకూ అప్పులు తీసుకొంటుండగా.. అప్పులిచ్చే వారికి ఎలాంటి అనుమతులు లేక పోయినా రూ.లక్షల్లో లావాదేవీలు సాగిస్తున్నారు.

మోసం చేస్తే చర్యలు తప్పవు



చిట్టీలు నడిపే వారు ప్రభుత్వ పరంగా తగిన అనుమతులు పొందాలి. అనధికారికంగా చిట్టీలు నిర్వహించడం నేరం. అలా చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవు. మొదట చిట్టీలు వేసే వారి పూర్వాపరాలు కచ్చితంగా తెలుసుకోవాలి.

– కంజాక్షన్, డీఎస్పీ, హిందూపురం

మడకశిర రూరల్ సీఐగా రాజ్‌కుమార్



మడకశిర: మడకశిర రూరల్ సీఐగా రాజ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కర్నూలు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇంతకు మునుపు ఇక్కడ సీఐగా ఉన్న సురేష్‌బాబు ఎస్‌బీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన సీఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. మట్కా, గుట్కా, పేకాట, మద్యం, ఇసుక తదితర వాటిని అరికట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు మంత్రి పర్యటన

రొద్దం: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ బుధవారం మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీపీ చంద్రశేఖర్ తెలిపారు. బొక్సంపల్లి, కోగిర, కంబాలపల్లి, బూచెర్ల, నారనాగేపల్లి, ఎం కొత్తపల్లి, తాడంగిపల్లి తదితర పంచాయతీల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

సోమందేపల్లి: మండలంలోని తుంగోడు గ్రామంలో ఈ నెల 29న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జాగీర్దార్ జిక్రియ హుసేనీ ఓ ప్రకటనలో తెలిపారు. పెనుకొండకు చెందిన ఖ్వాజా సయ్యద్ బాబా ఫక్రుద్దీన్ సీస్తానీ ఆస్పత్రి వైద్యులు తౌకీర, బాబాలు హాజరవుతారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్‌సీపీదే

- మంత్రి ఉషశ్రీచరణ్

రొద్దం: ఎవరు ఎవరితో జతకట్టినా... ఎంత మంది కలసివచ్చినా.. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే గెలుపు అని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని దొడగట్ట, రెడ్డిపల్లి, రొద్దం, ఆర్ లోచెర్ల, తురకలాపట్నం గ్రామంలో పంచాయతీల్లో బూత్ కమిటీల బలోపేతంపై సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులంతా కలసికట్టుగా పార్టీ విజమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పెనుకొండ కోటపై మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటా వివరించాలన్నారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు అందుతాయని వివరించాలన్నారు. చంద్రబాబు, టీడీపీ నేతలు చెప్పే అబద్ధపు, మోసపూరిత మాటలను నమ్మి ఎవరూరు మోసపోవద్దన్నారు. బూత్ కమిటీల బలోపేతంపై నాయకులు దృష్టి పెట్టాన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, దొడగట్ట సర్పంచ్ వజన, ఎంపీటీసీ బాలాజీ, రెడ్డిపల్లి సర్పంచ్ రత్నమ్మ, వైస్ ఎంపీపీలు రామాంజినమ్మ, హరితారెడ్డి, రొద్దం సర్పంచ్ రూప, ఎంపీటీసీ రత్నమ్మ, తురకలాపట్నం సర్పంచ్ లక్ష్మిదేవి, ఎంపీటీసీ మాధవి, ఆర్ లోచెర్ల సర్పంచ్ గంగాధర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, సింగిల్ విండో చైర్మన్లు లక్ష్మినారాయణరెడ్డి, కేపీ శ్రీనివాసులు, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు ఆరుటీరెడ్డి, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, సచివాలయ కన్వీనర్ చిలకల రవి, మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజారెడ్డి, కోఆప్షన్ మెంబర్ షఫీవుల్లా పాల్గొన్నారు.



రొద్దం మండలం తురకలాపట్నంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

ఆదరించండి.. అండగా ఉంటాం

గోరంట్ల: 'వర్తక వ్యాపార వర్గాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో ఆదరించాలి. పార్టీ అన్ని వేళలా మీకు అండగా ఉంటుంది' అని మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక గంపల రామకృష్ణారెడ్డి కాంపౌండ్‌లో మంత్రి ఉషశ్రీచరణ్ వర్తక వ్యాపార సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసిందన్నారు. ముఖ్యంగా దేశంలో ఎక్కడా లేని విధంగా వర్తక వ్యాపార వర్గాల అభ్యున్నతికి అనేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. వ్యాపార వర్గాలకు మేలు జరిగేలా కారిడర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పక్ష పార్టీ నాయకులు పొరుగు రాష్ట్రంలో ఉండి సేవ చేయాలని చూస్తున్నారని, ముఖ్యమంత్రి జగన్ పేదల సేవే లక్ష్యంగా రాష్ట్రంలో ఉండి సేవ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మినరసప్ప, పట్టణములోని వర్తక వ్యాపార సంఘాల నాయకులు బాలరాంగుప్తా, రాజేష్, శ్రీనాథ్, లక్ష్మినారాయణ, సుమన్‌రెడ్డి, శివాకుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో వర్తక, వ్యాపారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీ గురుకుల ప్రతిభావంతుల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపారు. ఇటీవల నిర్వహించిన 2023-24 ఒలింపియాడ్ పరీక్షల్లో పాఠశాల తరపున పాల్గొన్న విద్యార్థులు వరుసగా 2, 4, 6, 7, 8, 9, 10 ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. బుధవారం మంగళగిరిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరగబోయే కార్యక్రమంలో ప్రతిభావంతులు పాల్గొంటారన్నారు. ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

చౌళూరు రామకృష్ణారెడ్డికి ఘన నివాళి



రామకృష్ణారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మాజీ సమన్వయర్త, దివంగత చౌళూరు రామకృష్ణారెడ్డి ప్రజలకు చేసిన మేలు, పార్టీ కోసం అభివృద్ధికి చేసిన కృషిని ఎన్నటికీ మరవలేము'అని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. చౌళూరు రామకృష్ణారెడ్డి 47వ జయంతి సందర్భంగా మంగళవారం చౌళూరు గ్రామంలోని ఆయన సమాధి వద్ద కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రామకృష్ణారెడ్డి సోదరి మధుమతిరెడ్డి , భార్య జ్యోత్స్న, కుమారుడు తషన్‌రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మరో వైపు సేవా మందిర్‌లోని బ్లైండ్ స్కూల్‌లోని విద్యార్థులకు లేపాక్షి వైస్ ఎంపీపీ అంజన్‌రెడ్డి, ఆటో దాదు అన్నదానం చేశారు.

పేదల ప్రభుత్వాన్ని ఆదరించండి



ఆత్మీయ పలకరింపులో పాల్గొన్న చరణ్‌రెడ్డి

గోరంట్ల: పేదల సంక్షేమం కోసం దేశంలోనే ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. పేదలు మరింత అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టాలి' అని మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన గోరంట్ల పట్టణములోని నాల్గవ వార్డులో మంగళవారం సర్పంచ్ సరోజాబాయి నేతృత్వంలో పార్టీ శ్రేణులతో కలసి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో కలసి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రజలకు ఇచ్చి ప్రతి హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి పేదలను ఆదుకున్నారన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఆచారణ సాధ్యంకాని ఆరువందలకు పైగా హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. ప్రజలను మరోసారి మోసం చేయడానికి చంద్రబాబు తప్పుడు హామీలతో ముందుకు వస్తున్నారని, వాటిని నమ్మి ఎవరూ మోసపోద్దని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలేజయరాం నాయక్, మాజీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు గంపల వెంకటరమణారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్‌సాహెబ్, గోరంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు నూర్‌మహమ్మద్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ ధనుంజయరెడ్డి, గోరంట్ల ఉప సర్పంచ్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊరేగింపు విగ్రహాలు శుభ్రం

లేపాక్షి: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం దేవాలయంలో ఉన్న ఊరేగింపు విగ్రహాలను ఆలయ చైర్మన్ కరణం రమానందన్ సొంత నిధులతో శుభ్రం చేయించారు. పురాతనమైన విగ్రహాలు కొన్ని శిథిలావస్థకు చేరడంతో వాటికి మెరుగులు దిద్ది రంగులు వేయిస్తున్నారు. ఉత్సవాల్లో విగ్రహాలను ఉపయోగించనున్నట్లు ఈఓ నరసింహమూర్తి తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

పావగడ: తాలూకాలోని వెంకటాపురం గ్రామంలో శంకర కంటి ఆస్పత్రి, స్థానిక హెల్ప్ సొసైటీ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరంలో ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సుమారు వంద మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. అందులో 47 మందిని కంటి శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వారిని ప్రత్యేక వాహనాలలో బెంగళూరులోని శంకర కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ తదితరులు రోగులకు సేవలందించారు.

పాల కేంద్రంపై జేడీఎస్ జెండా

పావగడ: తాలూకాలోని లింగదహళ్లి గ్రామంలో జరిగిన పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నికల్లో పది మంది జేడీఎస్ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సంఘంలో మొత్తం 13 మంది సభ్యులు ఉండగా కాంగ్రెస్ నుంచి ముగ్గురు సభ్యులు గెలుపొందారు. ఎన్నికల్లో గెలిచిన 10 మంది జేడీఎస్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేఎంఎఫ్ డైరెక్టర్ చన్నమల్లప్ప, జేడీఎస్ నాయకులు సణ్ణారెడ్డి, ఆదినాయక, సొగడు వెంకటేశ్, ఆదినారాయణరెడ్డి, వీరేంద్ర తదితరులు విజేతలను అభినందించారు.

పేదలకు వరం 'జగనన్న ఆరోగ్య సురక్ష'



అగళి మండలం ఆలూడిలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్య సిబ్బంది

సాక్షిబృందం: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని అధికారులు తెలిపారు. మంగళవారం మడకశిర, పెనుకొండ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం గ్రామ స్థాయిలోనే అన్ని రకాల వ్యాధులకు వైద్య చికిత్సలు అందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు, వైద్య సిబ్బంది రోగులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. వైద్య చికిత్సల అనంతరం రోగులకు పలు ఆరోగ్య సూత్రాలను వివరించారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్నా వారికి పైసా ఖర్చు లేకుండా వైద్య చికిత్సలు నిర్వహించి మందులను అందిస్తున్నారని వైద్యులు తెలిపారు.

లబ్ధిదారులకు కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు

గుడిబండ: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందితో ఏఓ నారాయణప్ప సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఆరోగ్యశ్రీ లబ్దిదారులకు రూ. 25 లక్షల వరకూ వైద్యం పొందేలా ఆరోగ్యశ్రీ పరిమితిని సీఎం జగనన్న పెంచారన్నారు. దీనికి సంబంధించి కొత్త కార్డులను కూడా జారీ చేశారని ఏఓ నారాయణప్ప తెలిపారు. నూతన కార్డులను వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి అందించాలన్నారు. అదే విధంగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం ఎలా పొందాలనే దాని పైన కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈఓఆర్డీ నాగరాజునాయక్, కార్యదర్శులు, వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే హిందూపురం పట్టణంలోని బాలాజీ కళాశాల విద్యార్థులు మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ వీరభద్రప్ప మాట్లాడుతూ భవిష్యత్ తరాలు బాగుండాలంటే ప్రతి ఒక్కరూ ఒక చెట్టును నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్థానిక జెడ్పీ పాఠశాలలో మొక్కలు నాటి ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఎం ధనుశ్రీ, డీడీ శివయ్య, ఎన్ఎస్ఎస్ పీఓ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.